# మరపురాని జ్ఞాపకమా

## అతని డైరీలో 'ఆమె'–

**సౌందర్యం సైతం చిరునామా వెతుక్కునే ఆ నవ్వులో పోగొట్టుకున్న నా మనసు కన్పిస్తుంది. తిరిగి తీసుకోవాలనుకుంటాను. కమలాల ఆ కళ్ళు నన్ను అశక్తుణ్ణి చేస్తాయి.**

ఆమె జ్ఞాపకాల సైకత తీరాల్లో అనుభూతుల్నేరుకోవాలని ఏదో చిన్న ప్రయత్నం. విచ్చుకునే అనుభూతుల గులాబీ తోటలో ప్రతి పువ్వు ఆమే. అవ్వడనుకుంటాను. ఈ జీవితానికేం మిగిలింది ఆమె తప్ప అని. చిత్రంగా బాధనిపించదు. స్వప్నం ఆమైతే మెలకువలో కూడా కనులు మూసుకుని స్వప్నించటాన్ని నేను ప్రేమిస్తాను. నాకంటే ముందే మేల్కొని నా తర్వాత నిద్రపోయే ఆమె ఆలోచనలు నన్నొక చిత్రకారుణ్ణి చేస్తాయి. కుంచె లేకపోతేనేం మనసుందిగా ఆమెని చిత్రించుకోటానికి.

* * *

ఈరోజు నా మనసంతా ఆమెకు చెప్పాలనుకున్నాను. ఆమెతో గడిపిన అన్ని గంటల కాలంలోనూ ఒకటే పరిస్థితి–

'గుండె గొంతుకలోన కొట్లాడతాదీ
కూకుండనీదురా కూసింత సేపు'

నండూరి వారు నా కోసమే అలా వ్రాసారేమోనన్పించింది. లేకపోతే నేనే మైపోయేవాణ్ణో నా పరిస్థితికో రూపం ఇచ్చుకోలేక.

* * *

ప్రియా!

నీకు తెలుసా?

చంద్రుడీమధ్య నాకు ప్రియనేస్తమైపోయాడు.

నా జ్ఞాపకాల సుమాలల్లో తెస్తున్నాడు.

ఒక్క చంద్రుడేమిటి ప్రకృతంతా నాదే నీ ఊహలతో పాటు.

మత్తుకోయిలల వసంత గీతాలూ స్వాతి చినుకు సందడులూ,

తుషార గీతాలూ సమీర స్వరాలూ,

సంతోషపు సరాగాలూ మృదు మధుర నాదాలూ,

పారిజాతాల పరిమళాలూ జాజి మొగ్గల గుభాళింపులూ,

జీవితాన్ని రాగరంజితం చేసేదేదైనా నాకు చాలా చాలా ప్రియమన్పిస్తోంది. వాటికా అందం నీ ఊహల సంగమంతోనే వచ్చిందేమోనన్పిస్తోంది సుమా!

నా హృదయవనంలోని

ప్రేమ గులాబీ ఆమె జడలో జాజిదండైతే బావుండు.

నా మనస్సు

నందివర్ధనమ్మై ఆమె చరణాలు చేరితే బావుండు.

ఆమె మనఃమందిరాన


నేనే దైవమైతే

ప్రభూ ఇంకేం కావాలీ జీవితానికి.

కానీ – ఆమె మనసేంటో???

* * *

## 'ఆమె మనసులోని మాట'–



ఎప్పటిలానే ఈ రోజు కూడా అనుకున్నాను తనంటే నాకేమిటో చెప్పాలని. కానీ భావనాఇకి భాష చాలటంలేదు. మనసు మ్మాత్రం ఉంది. కానేంలాభం అదవ్యక్తంకదా.

నా మౌనం

ప్రేమ గీతమై ఆమెని ముంచేస్తే బావుండు.

నా కళ్ళవాకిళ్ళలోంచి

భావోద్వేగపు కెరటాలు ఆమెని నాలో కలిపేస్తే బావుండు.

అతన్ని చూస్తే నాకెప్పుడూ అన్పిస్తుంటుంది–

అతనిది Simple Living and High Thinking అని, అలాంటి వ్యక్తితో జీవితం బ్యూటిఫుల్‌గా వుంటుందనీను. కానీ అలా అని అతనితో చెప్పలేకపోతున్నాను. అహం అడ్డొస్తోంది. ఏం చేయను?

మగాడు కదా. కాస్త చొరవగా వుండొచ్చు కదా. నాతో లైఫ్ షేర్ చేసుకుంటానని చెప్పొచ్చుగా. నాకూ తెలుస్తోంది అతనిలో నాపై ప్రేముందని. నోటితో చెప్పకపోయినా ఆ విషయం చాలా రకాలుగా బయట పడుతోంది. పోనీ అతని మన స్సంత స్వచ్ఛంగా తెలుస్తోన్నా నేనూ చెప్పలేను. అలవాటైపోయిన హిపోక్రసీ అంత త్వరగా వదులుతుందా?

తనే అన్నాడు. నేనబద్ధం ఆడితే అతనిముందతకదట. నిజమే. కానీ, మరింత పరిశోధించాడుగా నా మనసు కతనిష్టమని. తెలుసుకోలేకపోయాడా. తెలిసే వుంటుంది. కానీ మేల ఈగో అడ్డొచ్చిందేమో. లేకపోతే చులకనైపోతానని భయమేమో.

పోనీ నేనే ఎందుకు ప్రపోజ్ చేయకూడదూ. ఏదో అధైర్యం వెనక్కిలాగుతోంది.

ఎంతో కేరింగ్‌గా వుంటాడు. అన్నీ అర్థం చేసుకున్నట్టే వుంటాడు. కానీ కొంచెం కూడా అర్థం చేసుకోలేకపోయాడు. లేకపోతే తప్పకుండా నన్ను తన జీవితంలో కాహ్వానించే వాడు కాదూ.

ఏదేమైనా అతనితో జీవితం పంచుకోవటాన్ని నేను ప్రేమిస్తాను. ఇప్పుడే కాదు ఎప్పుడూ. ఎన్నేళ్ళ తర్వాతైనా సరే.

ఎన్నో ఏళ్ళ తర్వాత ఈరోజు –

ఆమె భర్తతో చెప్తోంది వచ్చే సంక్రాంతికి మా వూరెళ్దామండీ అని. అతను సరేనన్నట్టున్నాడు. ఆమె అందంగా నవ్వింది.

ఇప్పటికీ ఆమెకా సంక్రాంతి సంబరాల్లో, మరెన్నో మధుర సమయాల్లో అతను గుర్తొస్తుంటాడు. ఆమె చిన్నగా నవ్వుకుంటుంది మధురోహల మాలలల్లుకుంటూ –

ఇప్పుడు –

ఆమె గతం ఒడ్డున అతనో గులకరాయి.

ఇక అతని సంగతంటారా???

–మోహి